విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

గోదావరి వరద ఉధృతి తగ్గేవరకు లంక, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టరు చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-ఆచంట: మంగళవారం ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించి, ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా అధికారు లకు జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు. స్థానిక ప్రజలు, నాయకు లతో ఆమె మాట్లాడారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రస్తుతం మనకు వర్షాలు లేకపోయినా, ఎగువన కురుస్తున్న వర్షాలు మనకు

వరద రూపంలో ప్రమాదం వచ్చే అవకాశాలు ఉన్నాయని. యధాస్థితికి వచ్చేవరకు లంక, లోతట్టు గ్రామాల వాసులు పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని జిల్లా కలెక్టరు కోరారు. పునరావాస కేంద్రానికి వచ్చిన ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకుండా వారికి వసతి ఏర్పాటుతోపాటు అల్పాహారం, టీ, భోజన సౌకర్యం, వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకున్నా మన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పుకార్లు, వదంతులు నమ్మవద్దని, అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని కలెక్టరు విజ్ఞప్తి చేశారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని లంకవాసులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను కలెక్టరు ఆదేశిం చారు. కలెక్టరు వెంట ఫ్లడ్ ప్రత్యేక అధికారి బి.పిచ్చయ్య, తహశీల్దారు ఐ.పి.శెట్టి, యంపిడివో పి.నరసింహప్రసాదు, మండలంలోని వివిధ శాఖల అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వరద ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కుక్కునూరు వేలేరుపాడు మండలాల్లో తీవ్రమైన ప్రభావాన్ని చూపాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో వరద ప్రభావం పూర్తిగా తగ్గేవరకూ పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. వరదల కారణంగా 10 గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వివిధ శాఖలకు సంబంధించి రూ.187 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. వరద ముంపునకు గురైన కుక్కునూరు, వేలేరుపాడు గ్రామాలలోని 5 వేల మంది ప్రజలను 15 పునరా వాస కేంద్రాలకు తరలించి, భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. కొయిదా, కట్కూరు, నార్లవరం, రుద్రంకోట, తోటకూర గొమ్ము రేపాకగొమ్ము, నెమలిపేట, మేడేపల్లి,

రామవరం, గొమ్ముగూడెం, మాధవరం, లచ్చిగూడెం, కౌడిన్యముక్తి, తదితర గ్రామాల ప్రజలను వరద సహాయక కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు. 231 ఇళ్ళు దెబ్బతిన్నాయన్నారు.30 గొర్రెలు, పాడిపశువుల చనిపోయాయన్నారు.5305 హెక్టార్లలో పంట నష్టం కలిగిందని, 64 హెక్టార్లలో ఉద్యానవనాల పంటలు నీట మునిగాయ న్నారు.333 కిలోమీటర్ల మేర రోడ్లు భవనాల శాఖ రోడ్లు దెబ్బతిన్నాయని,దీనివల్ల రూ. 167 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 13 రోడ్లు దెబ్బతిన్నాయని, దీనివల్ల రూ.75 లక్షల నష్టం వాటిల్లిం దన్నారు. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి 17 నీటివనరులు దెబ్బతిన్నాయని, రూ.3 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ఆర్.డబ్ల్యు.ఎస్. పైప్ లైన్లు, విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని, అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారన్నారు.

డ్రైనేజి డీఈఈ సస్పెన్షన్

విశాలాంధ్ర-భీమవరం :మోగల్లు వద్ద గోస్తని డ్రైన్ గండి పడటానికి డ్రైనేజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వి.వి కిషోర్ పర్యవేక్షణ లోపంతో, సరైన ముందస్తు చర్యలు తీసుకోకుండా పూర్తి బాధ్యతా రాహిత్యంతో ఉన్నందున సస్పెన్షన్ వేటు పడింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అత్యంత జాగ్రత్తగా, ప్రజలకు ఇబ్బంది కలుగని విధంగా విధులు నిర్వర్తించవలసిన అధికారి తీవ్ర అలసత్వం కారణంగా గండి పడటం, వేలాది ఎకరాలు వరద ముంపునకు గురికావడంతో పాటు, గుత్తులువారిపాలెం ఎస్టీ కాలనీ ప్రజలు వరద నీటి కారణంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడం దీనికి ప్రధాన కారణంగా ఉంది. డ్రైనేజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ ఎం.వి.వి కిషోర్‌ను సస్పెన్షన్ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : సైబర్ నేరాలు ప్రజలకు, పోలీసులకు సవాలుగా మారాయని, పేద,మధ్య తరగతి, భాగ్యవంతులు అనే తేడా లేకుండా ఈ ఉచ్చులో పడుతున్నారని, ఈ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో శ్రీవిజ్ఞాన వేదిక, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న సైబర్ నేరాల అప్రమత్తత ప్రచార భేరి బ్రోచర్‌ను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు చేయాలని, వెంటనే తగు చర్యలు తీసుకుంటా మని,

ఇటువంటి అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ రంగసాయిని అభినందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి కళాశాలలో ప్రధాన కూడలిలో పోలీసు శాఖ సహకారంతో స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని ప్రచార అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ దాస్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నగరపాలక సంస్థ
బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఓ.సి.నెం.4041/2024/ఏ1 తేది: 23-07-2024

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోగల ఈ దిగువ ఉదహరించిన వివిధ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఖాళీగా ఉన్న షాపు రూములు బహిరంగవేలము ద్వారా కేటాయించుటకుగాను ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 56, **తేది.05-02-2011** మరియు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 198, **తేది. 08-05-2012** నందలి నిబంధనలు మరియు పశ్చిమగోదావరి జిల్లా గెజిట్ సప్లిమెంటు సంఖ్య 76, **తేది.23-08-2014** ప్రకారము ది. **31-07-2024 తేది బుధవారం ఉదయం గం.11.00 నుండి** ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయము ఆవరణ యందు బహిరంగవేలము నిర్వహించుటకు నోటీసు జారీ చేయడమైనది.

నూతనముగా నిర్మించబడి వున్న షాపులను అద్దె ప్రాతిపదికపై షాపులను కేటాయించుటకు:
1) రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ ప్రక్కన షాప్-1, సాల్వెన్సీ- రూ.2,50,000/-, 2, 3. షాపులకు సాల్వెన్సీ - రూ.1,00,000/- నగరపాలక సంస్థ వారు షాపుల వారీగా నిర్ణయించిన సాంవత్సరిక అద్దెపై 10 శాతము ధరావత్తుగా చెల్లించాలి.

గుడ్ విల్ పద్ధతిపై కేటాయించుటకు :
1) ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్-13, 2) లావేటి అప్పల స్వామి మార్కెట్-14, గుడ్ విల్ రూ.25,000/-, సాల్వెన్సీ-రూ.1,00,000/- 3) మెయిన్ ఫిష్ మార్కెట్-2, గుడ్ విల్ రూ.1,45,000/-, రూ.1,00,000/-, సాల్వెన్సీ-రూ.1,50,000/-, రూ.1,00,000/-

అద్దె ప్రాతిపదికపై కేటాయించుటకు:
1) వంగాయగూడెం చేపల చెట్టు మార్కెట్-8, **2)** బాపూజీ కాంప్లెక్స్-3, **3)** కందుల సూర్యం కాంప్లెక్స్-FF-2, **4)** పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు North FF-3, **5)** పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South GF-1, **6)** పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South FF-5, **7)** పాండురంగా కాంప్లెక్స్ 'B' బ్లాకు South GF-7, **8)** క్యాటిల్ డిపో FF-8, **9)** కస్తురిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్-2-2, **10)** మెయిన్ రోడ్ షాపింగ్ కాంప్లెక్స్-1, **11)** మెయిన్ ఫిష్ మార్కెట్-21, **12)** యడ్లబండి స్టాండ్-2, **13)** గజ్జలవారి చెరువు బుద్ధా పార్క్-22, **14)** ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్- 4, 16(SC) **15)** చోడిదిబ్బ కాంప్లెక్స్-2, **16)** ASR C బ్లాక్ GF-4, **17)** ఆనంద్ కుమార్ కాంప్లెక్స్-1, **18)** న్యూ ఫిష్ మార్కెట్-12. **19)** యడ్లబండి స్టాండ్ కాంప్లెక్స్-4, **20)** NS షాప్స్ -1. నగరపాలక సంస్థ వారు షాపుల వారీగా నిర్ణయించిన సాంవత్సరిక అద్దెపై 10 శాతము ధరవత్తుగా చెల్లించవలయును. సాల్వెన్సీ-రూ.1,00,000/-

ఇతర వివరములకు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకోనగలరు. సంప్రదించవలసిన **ఫోన్ నెంబర్లు 7013187783, 9849907144, 9492974794.**

కమీషనర్, నగరపాలక సంస్థ, ఏలూరు.

మాటల మాయ

- అంకెల గారడి బడ్జెట్
- పోలవరం పూర్తయ్యేనా!
- వ్యవసాయానికి దక్కని మద్దతు ధర
- ఉపాధి హామీ పథకానికి తూట్లు
- ఆక్వా ఊసే లేదు

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పశ్చిమ గోదావరి జిల్లాకు కోడలు. ఈసారి కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఆమె వరాలు ఇస్తారని ఆశ అడియాశగా మారింది. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను విస్మరించిన బడ్జెట్‌గా కనపడుతుంది. టక్కు టమారా విద్యలను ప్రదర్శిస్తూ నిర్మలమ్మ మాటలతో మభ్యపెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ ను ప్రజా కేంద్ర బడ్జెట్ అని అభివర్ణిస్తూనే ప్రాధాన్యత రంగాలలో ఎడాపెడా కోతలు పెట్టారు. ధరలు మరింతగా పెరిగి సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తుంటే నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేసే ఒక్కటంటే ఒక్కటి కూడా బడ్జెట్లో ప్రస్తావనకు నోచుకోలేదు. నిరుద్యోగం తీవ్రంగా ప్రబలుతున్న వేళ ఉద్యోగ, ఉపాధి కల్పన అంశాల పైన ప్రకటన వస్తుందని ఆశించిన వారికి నిరాశ ఎదురయ్యింది. ఉద్యోగ కల్పన ఓ మిధ్యగానే మిగిలిపోనుంది. రాష్ట్రాలకు మేలు చేసే కేటాయింపులలోను కోతలు పెట్టి సమాఖ్య స్ఫూర్తిపై దాడిని అన్ని రంగాలలోనూ కార్పొరేట్లకు అనుకూలంగా కేటాయింపులు విభజనతో అన్ని విధాలా నష్టపోయిన రాష్ట్రానికి ఎప్పటి మాదిరిగానే ఈ బడ్జెట్‌లోనూ మొండి చేయి చూపించారు.

పోలవరం ఎప్పటికి పూర్తయ్యేను?

తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు ఈసారి బడ్జెట్లో కేటాయింపులు ఉంటాయని ఆశించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన నిధులపైన తగు నిర్ణయాలు తీసుకుంటారని భావించారు. కేంద్ర బడ్జెట్లో పోలవరంపై నిధుల వర్షం కురిపిస్తారని ఎదురు చూశారు. నిర్మలమ్మ బడ్జెట్ ప్రవేశపెట్టిన దగ్గర నుంచి ముగించే వరకు ఆశతో అందరూ చెవులురిక్కించి మరి ఆలకించారు. పోలవరం ప్రాజెక్టుకు సంతృప్తికర నిధులు కేటాయించడమే కాకుండా విధాన ప్రకటన చేస్తారని ఆశించిన వారందరికీ భంగపాటు ఎదురైంది. పోలవరం తామే పూర్తి చేస్తామంటూ ప్రకటించడమే తప్ప నిధుల కేటాయింపు మాత్రం నేతి బీరకాయలో నెయ్యి అన్న చందంగా ఉంది. తెలుగు ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు కుంటుపడిపోగా గడచిన 5 సంవత్సరాలలో ప్రాజెక్టు డిజైన్లను కుదించేలా వ్యవహరించారు. ప్రస్తుతం నిధుల ప్రస్తావన లేకుండా తామే పూర్తి చేస్తామని ప్రకటనతో సరిపెట్టారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను గాలికి వదిలేసారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు రావణకాష్టంగా ఉంది. నిర్వాసితులకు చెల్లించాల్సిన ప్యాకేజీల గురించి ఇసుమంతైనా నిర్మలమ్మ ప్రస్తావించక పోవడం ఆంధ్రులను అవమానించినట్లే. అత్యధిక ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా గుర్తించిన పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో అనే ప్రశ్న అందరిని వేధిస్తుంది.

వ్యవసాయ రంగం నిర్వీర్యం

రూ.48 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేవలం రూ. 1 లక్ష52 వేల కోట్లు మాత్రమే కేటాయించడం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడమే. రైతులు కోరుకున్న విధంగా రుణమాఫీ, మద్దతు ధరలు గ్యారంటీ చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు వంటి అంశాలు ఈ బడ్జెట్ లో ఇటువంటి ప్రతిపాదనలు లేకపోవడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తుంది.

ఉపాధి హామీకి తూట్లు

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు తగ్గించి తూట్లు పొడిచింది. ఉపాధి హామీకి రూ.86 వేల కోట్లు కేటాయించడం అంటే వ్యవసాయ కార్మికులు, పేదలు, బలహీన వర్గాలకు తీవ్రమైన అన్యాయం జరిగింది. సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కూలీలు డిమాండ్ చేస్తుంటే ప్రస్తుత కేటాయించిన బడ్జెట్ కేవలం 100 రోజుల పని దినాలకు మాత్రమే సరిపోతుంది. అనుకున్నట్లుగానే నిర్మలమ్మ ముచ్చటగా 7వ సారి బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ గా ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు.

కార్పొరేట్ బడ్జెట్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా

మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్ గా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు.డెబ్బయి శాతం ప్రజలు ఆధారపడ్డ వ్యవసాయరంగానికి బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం 3 శాతం నిధులు కేటాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో, ఉపాధి హామీ పథకం నిధులలో కోత విధించడం వలన రైతుల, వ్యవసాయ కార్మికుల, గ్రామీణప్రజల జీవనోపాధి దెబ్బతింటుందని విమర్శిం చారు. కార్పొరేట్లకు ఎన్ని రాయితీలు ప్రకటించినా పారిశ్రామిక వృద్ధి పెరగలేదన్నారు. ఆక్వా రంగంలో కేటాయింపులు లేవన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తామే పూర్తి చేస్తామని కంటి తుడుపు ప్రకటనతో సరిపెట్టారని ఎద్దేవా చేశారు.

రెండోరోజు కొనసాగిన ట్రిబుల్ ఐటీ కౌన్సిలింగ్

విశాలాంధ్ర- నూజివీడు :2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండవ రోజు జనరల్ కౌన్సి లింగ్ ప్రక్రియ మంగళ వారం జరిగింది. ఈ కౌన్సిలింగ్‌కు 535 మందిని హాజరవ్వాలని సూచించగా 446 మంది ఆర్జీయూకేటీ నూజివీడు

క్యాంపస్‌కు ప్రవేశాలు పొందారు.1050 సీట్లకు గాను 882 (బాలికలు 577,బాలురు 305) మంది ప్రవేశం పొందగా 168 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన సీట్లకు త్వరలో రెండవ దశ కౌన్సిలింగ్ ప్రారంభిస్తామని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్ర కుమార్ తెలియజేశారు.

ఎంపీడీవో వెంకట రమణరావు మృతి

విశాలాంధ్ర-నరసాపురం: గత కొద్ది రోజులుగా అదృశ్యమైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకటరమణ మృతదేహాన్ని మంగళవారం ఎస్డీఆర్ఎఫ్ బృందం కనుగొంది. ఏలూరు కాల్వలో తూటికాడల మధ్య ఇరుక్కుని ఉన్న మృతదేహాన్ని ఎంపీడీవో వెంకటరమణ మృత దేహంగా పోలీసులు ధృవీకరించారు. ఆయన మృతదేహాన్ని ఎస్డీఆర్ఎఫ్

బృందం కాలువ నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటరమణారావు ఈ నెల 15వ తేదిన మిస్ అయిన సంగతి తెలిసిందే. ఈ విషయం గురించి ఆయన భార్య కృష్ణాజిల్లాలోని పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో 16 వ తేదీన ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ మిస్సింగ్ విషయం గురించి సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ కూడా అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

పంట నష్టపోయిన రైతులకు రూ.20 వేలు చెల్లించాలి

విశాలాంధ్ర-కామవరపుకోట: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వచ్చిన వరద ప్రాంతాల్లో వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ. 20 వేలు పరిహారం చెల్లించాలని సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడాది పొడవున

భార్య పిల్లలతో సహా కష్టించి పంటలు పండించే రైతులకు దళారీ వ్యాపారులు గిట్టుబాటు ధర ఇవ్వక రైతుకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు క్రిమిసంహారిక మందులు వ్యవసాయ పనిముట్లు అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రైతన్నకు గోరుచుట్టుపై రోకటి పోటు చందాన వరదలు వచ్చాయన్నారు. వరదల్లో వరి నాట్లు ఇతర వాణిజ్య పంటలు నీళ్లపాలై విపరీతంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వం పై ఉందని టీవీఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం కామవరపుకోట ప్రాంతంలో వరదలకు నష్టపోయిన పంట భూములను సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించింది. రుణ విమోచన చట్టం చేసి వాణిజ్య బ్యాంకులు సహకార సంఘాల్లో రైతులు తెచ్చుకున్న పంట రుణాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గారావు, రాంబాబు, రాఘవులు, కాసూరు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కే. ప్రతాప్ శివ కిషోర్ హామీ ఇచ్చారు. మృతుల కుటుంబీకులు ఎప్పుడైనా తనను నేరుగా కలిసి సమస్యలు తెలియజేస్తే వాటిని పరిష్కరించేందుకు పక్షం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల అనారోగ్యం కారణాలతో మృతి చెందిన కానిస్టేబుల్ మధు కుమార్ కుటుంబానికి మంగళవారం ఏలూరులోని

పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పి కిషోర్ చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ అనారోగ్యాల కారణంగా చనిపోయిన దాసరి మధు కుమార్ భార్య దుర్గాదేవికి ఫ్లాగ్ ఫండ్ నుండి రూ.25,000లు చెక్కును, విడో ఫండ్ నుండి రూ.50,000 లు చెక్కును ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ మధు కుమార్ చనిపోవడం ఎంతో దురదృష్టకరమైన సంఘటనని ప్రభుత్వ పరంగా మృతుని కుటుంబానికి అందాల్సిన ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతుని కుటుంబంలో అర్హులైన వారికి కారుణ్య నియమకం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పి జి. స్వరూప రాణి, పోలీస్ అధికార్లు సంఘం నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -ఉండి: భారీవర్షాలు, తుపాను కారణంగా మునకకు గురై పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఉండిలో వర్షాల కారణంగా ముంపునకు గురైన పంట పొలాల్లో సీపీఐ బృందం పర్యటించింది.

పంట మునకకు గురైన సార్వా రైతులను కలిసి పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉండికి చెందిన సార్వా రైతు మంతెన కృష్ణ 4 ఎకరాలు వరి నాట్లు వేశారని 4 ఎకరాలు మునకకు గురై పూర్తిగా వరి నాట్లు కుళ్ళిపోయిందన్నారు. ఎకరాకు సుమారు 13 వేలు పెట్టుబడి పెట్టానని, నాలుగెకరాలకు ఏభై వేల రూపాయలు పెట్టుబడి వ్యయమైందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ అధికారుల అంచనా మేరకు సుమారు 90 వేల ఎకరాల్లో సార్వా నాట్లు వేయగా సుమారు 32 వేల ఎకరాల్లో వరి నాట్లు ముంపుకు గురైనట్టు ప్రకటించారన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, తమరాని శ్రీనివాస్, దొమ్మేటి నాగరాజు, ఒంటెద్దు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-ఏలూరు: మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడి బడ్జెట్ అని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు. బడ్జెట్లో జిల్లాకు మళ్లీ మొండి చేయి చూపించారని ఎద్దేవా చేశారు. బడ్జెట్లో రైతులు పండించిన పంటకు మద్దతు ధర, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు ప్రస్తావనే లేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పట్ల నిరంకుశ వైఖరి మరోసారి వెల్లడైందని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల నష్టపరిహారం చెల్లించి కేటాయింపులు లేకపోవడం దుర్మార్గం అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కోసమే కేటాయింపులలో కోత విధించారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ కేవలం కోటి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పటం మోడీ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.కేవలం ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాసే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని విమర్శించారు.

పేదల వ్యతిరేక బడ్జెట్

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-ఉండి: దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులు, రైతాంగం, వ్యవసాయ రంగ కూలీలు, అణగారిన వర్గాల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్లో బడ్జెట్ ప్రవేశపెట్టిందని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు విమర్శించారు. మంగళవారం ఉండి సీపీఐ కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో పాల్గొన్న భీమారావు మాట్లాడుతూ పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై మాట్లాడుతూ ఎన్డీఏ పాలిత రాష్ట్రాల్లో ఐదు సంవత్సరాల పాటు అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను జరిపిందన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించింది అన్నారు. వ్యవసాయ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడం కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించేందుకేనని తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాధాన్యత లేని సెల్ ఫోను, బంగారం ధరలను తగ్గిస్తామని ప్రకటించారన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నింటి జీవనం దుర్భరంగా మారిన పరిస్థితుల్లో ఇలాంటి అంశాలపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, మండల సమితి సభ్యులు తమరాని శ్రీనివాస్, దొమ్మేటి వెంకట్, నాగరాజు, బొండాడ అప్పన్న, ఒంటెద్దు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నిరాశపరిచిన బడ్జెట్

బికేయంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు:పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్ర రాష్ట్రాన్ని నిరాశపరిచిందని బి కే యంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపి జనసేన బిజెపి ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండి కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించు కోవడంలో వైఫల్యం చెందాయని ఆయన అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలకు సంబంధించి నిధులు కేటాయించ లేదని తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, ప్రస్తావించలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుకు కేంద్ర బడ్జెట్లో స్పష్టత లేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో స్పష్టత వచ్చేలాగా చూడాలని ఆయన కోరారు. రాష్ట్ర రాజధానికి నిధులు కేటాయించడాన్ని అభినందించారు.

కార్మికుల ప్రస్తావన లేని బడ్జెట్

విశాలాంధ్ర -భీమవరం: కేంద్ర బడ్జెట్లో కార్మికుల ప్రస్తావన లేకపోవడం శోచనీయమని, విశాఖ ఉక్కు, కడప ఉక్కు బలోపేతానికి తీసుకున్న చర్యలను ప్రస్తావించక పోవడం దారుణమని ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు పై ఆయన భీమవరంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకున్న చర్యల ఊసే లేదన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు భద్రత, వారి సంక్షేమం పై మాట్లాడలేదన్నారు. ఇఎస్ఐ సౌకర్యాలు, పింఛన్లు పెంపు లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రయివేటీకరణ చేయమని మాట చెప్పలేదని కార్మికులకు భద్రత భరోసా లేని బడ్జెట్ అని చెల్లబోయిన విమర్శించారు.

పాపాదాసు మృతి సీపీఐకి తీరని లోటు

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: ఏజెన్సీ ప్రాంత ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన సీపీఐ సీనియర్ నాయకులు పాముల పాపాదాసు మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సీపీఐ

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సంతాపం తెలిపారు. పాపాదాసు అనా రోగ్యంతో బుట్టాయిగూడెం లో

తన స్వగృహంలో సోమవారం రాత్రి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణ చైతన్య పాపాదాసు స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పార్టీ జెండా కప్పి, పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఏజెన్సీ ప్రాంతంలో జరిగిన అనేక పోరాటాల్లో పాపాదాసు పాల్గొని జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. విలువలకు కట్టుబడి ఎన్ని ఆటంకాలు ఎదురైనా గత 40 సంవత్సరాలుగా ఎర్ర జెండాను విడవకుండా పార్టీలో కొనసాగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పార్టీ పిలుపుమేరకు ఏజెన్సీలో జరిగే ఉద్యమ కార్యక్రమాలకు విచ్చేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులతో మంచి సత్సంబంధాలు కలిగి పార్టీకి సేవలందించారని తెలిపారు. 1998లో బుట్టాయిగూడెం సొసైటీ అధ్యక్షునిగా ఎంపికై ఈ ప్రాంత ప్రజలకు సేవలందించారని కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా పట్టుకుని పోరాటం చేసిన పాపాదాసును ఆదర్శంగా తీసుకోవాలన్నారు.పార్టీతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేసిన ఆయన మన మధ్య భౌతికంగా లేకపోవడం తీరని లోటని ఆయన తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, మండల సహాయ కార్యదర్శి మడకం దుర్గారావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. ఫ్రాన్సిస్ పాపాదాసు పార్థివదేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు.

వీడని ముసురు

ఏడు రోజులుగా ఇదే పరిస్థితి

విశాలాంధ్ర-లింగపాలెం: వీడని ముసురుతో లింగపాలెం మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో మంగళవారం వాతావరణం చల్లబడి జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో ఏడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మేజర్ పంచాయతీ ధర్మాజీ

గూడెంలో వర్షానికి కూలిపడిన పెద్ద వృక్షం వల్ల మంచినీటి పైపులైను దెబ్బతింది. దీంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. వాతావరణం అనుకూలించనప్పటికీ పంచాయతీ అధికారులు పైపులైను లీకేజీని సరి చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిం చారు. పంచాయతీలోని భట్రాజులవీధి, తాత గారి కాలనీకి నీరు అందక పోవడంతో పైపులైనుకు అడ్డుపడిన చెట్ల వేళ్లను తొలగించి ఈప్రాంతాలకు నీటి సరఫరా చేయించారు. వీడని ముసురు వల్ల గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు నెలకొనటంతో ధర్మాజీగూడెం, లింగపాలెం, కే.గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనే వైద్యాధికారులు ప్రీతి, కృష్ణకిషోర్, సంధ్యారాణి వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలపై సూచనలు చేశారు. వర్షాలు తగ్గగానే గ్రామాల్లో శానిటేషన్ పనులు చేయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వైద్య అధికారులు తెలిపారు. వర్షాల వల్ల కూలిపనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వరద బాధితులకు పునరావాస కార్యక్రమాలు

విశాలాంధ్ర-కుక్కునూరు: గోదావరి వరద ముంపు వలన కుక్కునూరు మండలంలో 21 గ్రామాలు ప్రభావిత గ్రామాలుగా గుర్తించి సహాయ చర్యలు చేపట్టడం జరిగిందని జంగారెడ్డిగూడెం ఆర్డిఓ కె. అద్దయ్య తెలిపారు. గొమ్ముగూడెం, మాధవరం పంచాయితీల్లోని వరద

ప్రభావిత కుటుంబాలకోసం మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీ పునరావాస కేంద్రంలో గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 250 కుటుంబాలను, లచ్చిగూడెం గ్రామంలోని 140 కుటుంబాలను సమీపంలోని గుట్టపై ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోకి, కౌండిన్యముక్తి గ్రామం నుండి 38 కుటుంబాలను, ఆర్ అండ్ ఆర్ కాలనీ మర్రిపాడులోని పునరావాస కేంద్రానికి తరలించినట్టు తెలిపారు. ప్రస్తుతం దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీ, మర్రిపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో ఉంటున్న వరద బాధితులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనం కల్పిస్తున్నామన్నారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన సమయంలో వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 12 బోట్లను కూడా సిద్ధం చేశామన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై స్థానిక తాడేపల్లిగూడెం ప్రాంతీయ కార్మిక శాఖ అధికారి గోపి కుమార్‌ను మంగళవారం ఏఐ టీయూసీ ఆధ్వర్యంలో నాయకులు కలిసి పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయాలని కోరారు. గత ఐదు సంవత్సరాలుగా సుమారు

200 మంది భవన నిర్మాణ కార్మికులు వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారని, ఇంతవరకు డబ్బులు అందకపోవడం, ఈ శ్రమ కార్డు ద్వారా ఉన్న ప్రమాద పరిహార బీమా విషయమై కార్మిక శాఖ అధికారి గోపి కుమార్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారి గోపి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తక్షణం పరిహారాల దరఖాస్తులను సెటిల్ చేస్తామన్నారు. ఈ శ్రమ కార్డు ద్వారా లభించు ప్రమాద బీమా విషయమై నాయకులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయ తాపీ వడ్రంగి సెంట్రింగ్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి అత్తిలి బాబి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలిరాతి ఆదినారాయణ, కోశాధికారి కోడె సాయి బాలాజీ, యూనియన్ నాయకులు ఉప్పులూరి మధు, ఏ ఎల్ ఓ. గోపి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. కోర్టు సముదాయంలో కన్నుల పండుగగా జరిగిన కార్యక్రమంలో న్యూటన్ తో పాటు ప్రధాన కార్యదర్శిగా అడబాలా ప్రసన్న కుమార్,

జాయింట్ సెక్రటరీగా జవ్వాది సత్యనారాయణ, ట్రెజరర్‌గా సిహెచ్ వి ప్రసాద్ కార్యవర్గ సభ్యులుగా వంశీ, శ్యామల ప్రమాణ స్వీకారం చేశారు. ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లబోయిన రంగారావు బార్ అసోసియేషన్‌కు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న న్యాయ్యవాదుల సమస్యలపై దృష్టి సారించాలని, నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాలను త్వరితగతిన పూర్తి చేయాడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం చెల్లబోయిన అసోసియేషన్ సభ్యులను సత్కరించారు.

ఎప్పటికప్పుడు పునరావాస కేంద్రాలు పర్యవేక్షణ

విశాలాంధ్ర-వేలేరుపాడు: గోదావరి వరద ముంపు వలన వేలేరుపాడు మండలంలోని 36 గ్రామాలు ప్రభావిత గ్రామాలుగా గుర్తించి సహాయక చర్యలు చేపట్టినట్టు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య తెలిపారు. కోయిదా, కటుకూరు, నార్లవరం, రుద్రం కోట, తాట్కూరుగొమ్ము, రేపాక గొమ్ము పంచాయితీల్లోని వరద ప్రభావిత కుటుంబాలకు 4 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శివకాశీపురంలోని పునరావాస కేంద్రానికి రేపాకగొమ్ము నుంచి 393 కుటుంబాలను, వేలేరుపాడు గ్రామం నుండి 15 కుటుంబాలను, నెమలిపేట ఆర్ అండ్ ఆర్ కాలనీలోని పునరావాస కేంద్రానికి తరలించినట్టు తెలిపారు. ప్రస్తుతం 15 వరద ప్రభావిత గ్రామాలకు కూరగాయలు, పాలు, కొవ్వొత్తులు, వాటర్ ప్యాకెట్లు, మస్కిటోకాయిల్స్, బిస్కట్లు, 800 టార్పాలిన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యుత్ సమస్య లేకుండా 12 జనరేటర్లను అందుబాటులో ఉంచామన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి మూడవ ప్రమాద హెచ్చరికకు అనుగుణంగా కూడా సహాయ చర్యలు మరింత వేగవంతం చేసేందుకు వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 18 బోట్లు సిద్ధం చేశామన్నారు. మండలంలోని మేడేపల్లి, రామవరం, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, పంచాయతీల్లోని 12 గ్రామాలు ప్రభావితం అయిన సందర్భంలో ఆయా ముంపు ప్రభావిత గ్రామాలకు చెందిన 968 కుటుంబాలకు చెందిన 3517 మంది ప్రజలకు పునరావాస కేంద్రాల్లో ఉంచడం జరిగిందన్నారు. వారికి అవసరమైన భోజనం, మంచినీరు, చంటిపిల్లలకు పాలు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభావిత కుటుంబాలకు 117 టార్పాలిన్లు కూడా పంపిణీ చేశామన్నారు.

సహాయక చర్యల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర-ఆచంట: గోదావరి సహాయక చర్యలలో అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆచంట మండలం వశిష్ట గోదావరి వరద ఉధృతి, పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అనంతరం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పోలీసు, విద్యుత్తు, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూయస్, అగ్నిమాపక, పశు సంవర్ధక, మత్స్య, తదితర శాఖల అధికారు లతో వరదల కారణంగా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గోదావరి వరద ఇంకా ఉధృతంగా కొనసాగుతున్న దృష్ట్యా అధికారులు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవా లన్నారు. లంక గ్రామాల ప్రజలకు భోజన, వసతులు, త్రాగునీరు సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పశువులు నష్టం జరగకుండా, సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడాలన్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలు, సర్వే బాధులు, వెదురు తడికెలు, తదితర సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. గోదావరి ఏటిగట్టు పటిష్టతకు నిరం తరం పరిశీలన చేసుకోవాలని, బలహీనత ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కన్జర్వెన్సీ అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. మంచి కండిషన్‌లో ఉన్న బోట్లు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్తు అంతరాయం కలగకుండా, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవా లన్నారు. ఈ సమావేశంలో ఫ్లడ్ ప్రత్యేక అధికారి బి. పిచ్చయ్య, తహశీల్దారు ఐ.పి.శెట్టి, యంపిడివో పి.నరసింహా ప్రసాదు, వివిధ శాఖల మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బడ్జెట్

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్య ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బయ్యనగూడెం గ్రామంలో ఆయన నివాసం వద్ద రామారావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పడుతున్న తపన ఈ బడ్జెట్ లో కనిపిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు,ఎన్నికల సమయంలో ఎన్డీఏతో పొత్తు పెట్టుకుని వెళ్లడం,ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కేంద్ర మంత్రులును కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్ని విధాల సహకరించాలని కోరినందున, బడ్జెట్లో రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించారని తెలిపారు.

మానవ సేవే మాధవ సేవ

విశాలాంధ్ర-టి నరసాపురం: మానవ సేవే మాధవ సేవ అని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు తెలిపారు. మండలంలోని రాజు పోతే పల్లి గ్రామానికి చెందిన మరియమ్మ అనే నిరుపేద కుటుం బానికి కామవరపు కోట సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, నిత్యవసర సరు కులు, కూరగాయలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మరియమ్మ ఇటీవల కడుపులో గడ్డకు సంబంధించి ఆపరేషన్ చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో చిలకా ఏసుబాబు అందించిన సమాచారం మేరకు బియ్యం, సరుకులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. దాతలు మరియమ్మకు సహాయంగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు గోరికల వెంకట్, పండూరి రామ సాయి, సౌజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దోమల నివారణ

విశాలాంధ్ర - ఏలూరు: ఈనెల 1వ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాం లో భాగంగా ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) వారి ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 13వ డివిజన్ లోని వైయస్సార్ కాలనీ, మరడాని రంగారావు కాలనీ, వివిఎస్ఆర్ బ్రాండ్ సిటీ, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలలోఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగినది.కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా .మాలతి, నాయకులు మెరుగు మాల శ్రీనివాస్, మలేరియా ఇన్స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా సూపర్వైజర్ డి. దుర్గారావు, ఆరోగ్య కార్య దర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించిన ఆరిమిల్లి

విశాలాంధ్ర -తణుకు: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వయ్యేరు - యనమదుర్రు డ్రైన్ లో అప్ స్ట్రీం లో ఉన్న నందమూరు ఆక్వడేట్ ను డిమాలిష్ చేసిన తర్వాత డ్రైన్ ద్వారా వర్షా కాలంలో వరద నీరు రావడంతో తణుకు నియోజకవర్గం తణుకు మండలం కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాలలో, అత్తిలి మండలం వరిఘేడు, తిరుపతి పురం గ్రామాల మీదుగా వెల్తున్నటువంటి డ్రైన్‌కు సంబంధించిన గేట్లు పూర్తిగా పాడైపోయాయని దాని కారణంగా పలు ప్రాంతాలు,పంట పొలాల నీట మునిగి రైతులు నష్ట పోతున్నారని అసెంబ్లీ సమావేశాలలో తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని సంబంధిత మంత్రులకు వివరించారు.

కోతకు గురవుతున్న రోడ్డు... ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర - ఉంగుటూరు : భారీ వర్షాలకు ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద కాగుపాడు వెళ్లే రహదారి కోతకు గురై ప్రమాదభరితంగా ఉంది. ఒకవైపు కల్వర్టుకు రైలింగ్ లేక, మరోపక్క కోతకు గురైన రోడ్డు ఒకే చోట ఉండటంతో మరింత ప్రమాదకరంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి వద్ద ప్రమాదకర హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదు రోజుల నుంచి ముంపులోనే పొలాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో గత 5 రోజుల నుంచి పంట పొలాలు ముంపులోనే ఉన్నాయి. భారీ వర్షాలకు తోడు ఎగువప్రాంతంలో నుంచి వచ్చిన వరద నీటివల్ల వెల్లమిల్లి, బాదంపూడి ఆయకట్టు పంట పొలాలు మంగళవారం కూడా ముంపులో ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలకు పూర్తిగా వరి నాట్లు కుళ్లిపోయాయని వాపోతున్నారు.

మురుగు సమస్యకు తాత్కాలిక పరిష్కారం

విశాలాంధ్ర- ఉంగుటూరు : కురిసిన వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు కారణంగా నారాయణపురం చేపల మార్కెట్ దగ్గర ఉన్న రైల్వే అండర్ పాస్, చేబ్రోలు రైల్వే గేట్ పక్కన ఉన్న రైల్వే అండర్ పాస్ నీట మునిగిపోయి. మంగళవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేబ్రోలు, నారాయణపురం రైల్వే కొలను పూడిక తీయించారు. దీంతో నీట మునిగిన సమస్య తాత్కాలికంగా తీరింది. చేబ్రోలు, నారాయణపురం గ్రామ సర్పంచ్లు రాందే లక్ష్మీ సునీత రాజారావు, దిడ్ల అలకనంద శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి ఊపిరి పోసిన కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర -భీమవరం: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ నిర్మాణానికి ఎంతో దోహదం చేస్తుందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి హర్షం ప్రకటించారు. మంగళవారం ఆమె భీమవరంలో మాట్లాడుతూ రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం, పోలవరం ప్రాజెక్ట్ 200 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పూర్తి నిర్మాణపు ఖర్చును కేంద్ర భరిస్తుందని ప్రకటించినందుకు తోట కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ నిరంకుశ పాలనతో తిరోగమనంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కు ఊపిరి పోసిన ఎన్డీఏ ప్రభుత్వ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముంపు బాధితులకు భోజనం

విశాలాంధ్ర -భీమవరం: యనమదుర్రు డ్రైన్ ముంపు బాధితులకు టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి సౌజన్యంతో మంగళవారం భోజనం పంపిణీ చేశారు. టిడిపి సీనియర్ నాయకులు మెంటే గోపి, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు, ఎద్దు ఏసు పాదం, తోట సురేష్, బాతు నరేష్ చేతుల మీదుగా 300 మంది పేద కుటుంబాలకు ఆహార పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేదునూరి గంగాధర్ తిలక్, విజ్జిరోతి రాఘవులు, పడమట నరసింహమూర్తి, షబీనా బేగం, రాధాకుమారి, మాదాస్ కనకదుర్గ, పద్మ, నసీమా బేగం, దొంగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణకు వ్యవసాయశాఖ సూచనలు తీసుకోండి

విశాలాంధ్ర -నూజివీడు : ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగు చేసే పలు రకాల పంటలను సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు నూజివీడు వ్యవసాయ శాఖ ఏడి జి. విద్యాసాగర్ వివరించారు. మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండలంలోని గ్రామాల్లో సాగుతున్న పంటలను ఆయన పరిశీలించారు. డివిజన్‌లోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో వరి సాగు దశలో ఉందని నారుమడి దశ నుంచి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యకాల పరిమితి రకాలను సాగు చేసుకోవాలని, నాట్లు వేసిన వరి పొలాలు వర్షాలకు నీటి ముంపుకు గురైన పక్షంలో వీటిని ఎక్కువ నిలువ ఉంచకుండా పలుచగా ఉంచాలన్నారు. సూచించిన మోతాదులో యూరియా, పొటాష్‌లను వెదజల్లుకోవాలని సూచించారు. వరి విత్తనాలు వెదజల్లు పద్ధతిలో సాగు చేసే రైతులు పడిపోని రకాలను ఎంపిక చేసుకోవాలని అన్నారు. జులై నెలలో మధ్య కాల రకాలను, ఆగస్టు నెలలో స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలి అన్నారు. వర్షాధారంగా సాగుతున్న పత్తి పంటకు వేరు కుళ్ళు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ లీటరు నీటికి మూడు గ్రాములు చొప్పున కలిపి మొక్క మొదట్లో తడపాలన్నారు.

కైకలూరులో సూర్య జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కైకలూరు : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతుల మిన్న అన్న చందాన సినీ నటుడు సూర్య పుట్టినరోజు సందర్భంగా అఖిల భారత యాదవ యువజన సంఘ అధ్యక్షులు, బిఎస్ఆర్ ఆక్వా ట్రేడర్స్ అధినేత, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బూరుబోయిన శ్రీనివాసరావు (బిఎస్సార్) కైకలూరు పట్టణంలో సూర్య ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రథమంగా కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న 100 మంది రోగులకు వైద్యులతో కలిసి రొట్టెలు,పండ్లు పంపిణీ చేశారు. అన్నా క్యాంటీన్ ద్వారా 400 మంది నిరుపేదలకు అన్నదానం చేసి సూర్య జన్మదిన కేక్ ను కట్ చేసి సూర్యకి శుభాకాంక్షలు తెలిపారు.మధ్యాహ్నం మండలంలోని తామరకొల్లు మదర్ తెరిసా ఆశ్రమంలో ఉంటున్న 50 మంది వృద్ధులకు దుప్పట్లు దానం చేశారు. అనంతరం కైకలూరు పట్టణంలోని వేలంపేట లో ఉన్న చిన్నారుల ఆశ్రమం నందు విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే సూర్య పుట్టినరోజు పురస్కరించుకుని ఎంతోమంది అభాగ్యులకు ఆసరాగా బిఎస్సార్ నిలిచారు. ఈ సందర్భంగా బిఎస్ఆర్ మాట్లాడుతూ తెలుగు సినిమా ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని పేరు సూర్య అని, సినీ ఇండస్ట్రీలో సూర్య దయాగుణం కలిగినవాడనే పేరుందని ఒక వైపు సినిమాలు చేస్తూనే మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలోనూ ఆయన ముందంజలో ఉండటంతో సూర్య చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకుని ఆయన పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏడాది తన సొంత సౌజన్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసి పేదల కలల్లో ఆనందాన్ని చూస్తున్నట్లు బిఎస్సార్ తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కైకలూరు సూర్యా ఫ్యాన్స్,బిఎస్సార్ ఆర్మీ పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్ మేళా

విశాలాంధ్ర - కాళ్ళ : బోధనాభ్యసన ప్రక్రియలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ముఖ్య భూమిక పోషిస్తుందని ప్రాంతీయ ఉపసంచాలకులు(కాకినాడ) జిల్లా విద్యాశాఖ అధికారిణి (పశ్చిమగోదావరి జిల్లా) జి నాగమణి అన్నారు. ఈరోజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలిలో జరిగిన శిక్ష సప్తాహ్ వారోత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన టీ ఎల్ ఎం, ఎఫ్ ఎల్ న్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ అంకితభావంతో పనిచేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు చోటు ఉండదని అన్నారు. ఇంత మంచి చక్కటి టీ ఎల్ ఎం తయారు చేసిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఎడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష శ్రీ పి. శ్యాంసుందర్ మాట్లాడుతూ . లో కాస్ట్ నో కాస్ట్ టి ఎల్ ఎం పిల్లలకు అర్థవంతంగా బోధించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ మండలంలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనాభ్యసన సామాగ్రిని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో మండల విద్యాశాఖది కారులు ఏ రవీంద్ర, కనక రాజు,బి.ఆర్.ఎం.కే. స్వామి, జి.బి.ప్రశాంతి, జి. సుబ్బారావు, డి. కనకదుర్గ, టి.ఎల్.కలికి మూర్తి, బాలాజీ సుబ్రహ్మణ్యం . ఎ. వి.సుబ్బరాజు, ఎన్. విజయలక్ష్మి, కె. వెంకట్రాం, పి.పాపారావు,సిఆర్పి . ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

జివి ఎస్వి ఆర్ఎం పాఠశాలలో శిక్ష సప్తహ్

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు పట్టణ పరిధిలోని జి.వి ఎస్.వి ఆర్.ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్ష సప్తహ్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ నాలుగు సంవత్సరాలు పూర్తి సందర్భంగా, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి శిక్ష సప్తహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లు గుమ్మళ్ళ వీరస్వామి, శర్మ వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా టి.ఎల్.ఎం మేళ జరిగింది. తల్లిదండ్రులు, విద్యార్థులను ఉద్దేశించి వీరిద్దరూ మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించవచ్చని తెలిపారు. ఆటలు కృత్యాలలో పిల్లలను నిమగ్నం చేయాలని, కథలు చెప్పటంలో మెలుకువలు, బొమ్మల ద్వారా అభ్యసనము. సాంకేతిక విద్య. పర్యావరణ పరిరక్షణ, సామాజిక భాగస్వామ్యం, మొదలైన అంశాల గురించి తల్లిదండ్రులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్. ఉపాధ్యాయులు త్రిమూర్తులు. చంద్రకళ, శశికళ, భవాని దుర్గ పాల్గొన్నారు.

పాలకొల్లులో కోడి రామకృష్ణ జయంతి

విశాలాంధ్ర - పాలకొల్లు : ఫాంటసీ చిత్రాలను రెండు దశాబ్దాల క్రితమే నిర్మించి చలనచిత్ర రంగానికి మార్గదర్శకంగా నిలిచిన గొప్ప వ్యక్తి కోడి రామకృష్ణ అని పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కె.వి.కృష్ణవర్మ అన్నారు. సోమవారం స్థానిక మారుతి థియేటర్లో కోడి రామకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వి.కృష్ణవర్మ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పాలకొల్లు కీర్తి, ప్రతిష్టలు పెంచిన గొప్ప వ్యక్తి కోడి రామకృష్ణ అని కొనియాడారు. తొలుత కోడి రామకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో వంగా నరసింహారావు, మేడికొండ శ్రీనివాసరావు, మానాపురం సత్యనారాయణ, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, వితాకుల వెంకట రమణ, నీలం శెట్టి సత్యప్రసాద్, కొమ్ముల మురళీకృష్ణ, గణేశ్న రవీంద్ర నాథ్, ముచ్చర్ల సత్యనారాయణ, బొక్కా రమాకాంత్, దియేటర్ మేనేజర్ దేవుళ్ళబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ పరిశీలన

విశాలాంధ్ర -నూజివీడు: మండలంలో యనమదల గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను నూజివీడు ఎంపీడీవో కిరణ్ కుమార్ పరిశీలించారు. మంగళవారం ఆధార్ సెంటర్ ను పరిశీలించిన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధార్ సేవలు అందించాలని సూచించారు.

రైతాంగానికి తీవ్ర నష్టం

విశాలాంధ్ర -భీమవరం: గత ప్రభుత్వం ఐదేళ్లుగా డ్రైనేజీ, ఇరిగేషన్ వ్యవస్థలను భ్రష్టు పట్టించడం మూలంగానే తన నియోజకవర్గంలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అసెంబ్లీ సమావేశంలో ధ్వజమెత్తారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తన నియోజకవర్గంలోని మేజర్, మీడియం, మైనర్ డ్రైనేజీలు మొరాయించాయని నారుమళ్లు, ఊడ్చిన చేలు ఇప్పటికీ ముంపులో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఇరిగేషన్, డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం

విశాలాంధ్ర-పోడూరు : నియోజకవర్గంలో ప్రజల కు అండగా ఉండి వారి సమస్యలపై పోరాటం చేద్దామని ఆచంట మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాధరాజు అన్నారు. తూర్పుపాలెం పార్టీ క్యాంప్ కార్యాలయం నందు పోడూరు ఆచంట మండలాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలతో ఆయన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుదామని రంగనాధరాజు అన్నారు. ఈ సమావేశంలో పోడూరు జడ్పీటిసి గుంటూరు పెద్దిరాజు ఆచంట పోడూరు మండలాల సర్పంచులు ఎంపీటీసీలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు పూర్వ ఉపాధ్యాయుల సహాయం

విశాలాంధ్ర - వేలేరుపాడు : పెద్దవాగు ప్రాజెక్టు వరద బాధితులకు పూర్వ ఉపాధ్యాయులు అప్పటి ఎంఈఓ జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో మంగళవారం సహాయం అందించారు. కమ్మరిగూడెం గ్రామస్తులు అందరికీ కావలసిన బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు సుమారు 250 కుటుంబాలకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఈ గ్రామం పూర్తిగా వరదల వలన చిన్న భిన్నమైనదని వరద బాధితులకు సహాయం చేయటం మా బాధ్యతగా భావించి గతంలో పనిచేసినటువంటి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులందరినీ సమీకరించి మా వంతు సహాయం ఇవ్వగలిగామన్నారు. సహకరించిన ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆ ఉపాధ్యాయులు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్నప్పటికీ కూడా వారు గతంలో పని చేసినటువంటి మండలంలో వరద బాధితుల ఇబ్బందులు గుర్తించి సహాయం చేయడం చాలా మంచి విషయమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, రవిబాబు, కృష్ణారావు, సిద్ధు, వెంకటేశ్వరావు, సున్నం నాగేశ్వరావు, వెంకటేష్, నాగలక్ష్మి, రోజా కుమారి, కమల, నోబుల్, విజయ్ కుమార్, నరేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో మెంటేవారి తోటవాసులు

విశాలాంధ్ర-భీమవరం టౌన్ : గత నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు మూలంగా యనమదుర్రు డ్రైన్ ఉధృతంగా ప్రవహించి భీమవరంలోని లోతట్టు గ్రామాలైన దుర్గాపురం, మెంటేవారి తోటలోని, పలు గృహాలు నీరుతో మునిగి పోయాయి. మెంటే వారి తోటలోని టిడ్కో హౌసెస్ 64 ఫ్లాట్లు ఉండగా క్రింద ఫ్లాట్లన్నింటిలో నీరు నిలిచిపోయింది. దీంతో ఆ ఫ్లాట్లలో నివసించే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే నీటిలో ఒకపక్క డ్రైనేజీ ఉండటంతో అటుగా వచ్చే నిర్వాసితులు డ్రైనేజీ ఎక్కడుందో తెలియక ప్రమాదంలో జీవనం సాగిస్తున్నారు.

అపరిశుభ్రంగా సచివాలయం, అంగన్వాడి కేంద్రం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : మండలంలో బయ్యనగూడెం గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న సచివాలయం ఆవరణమంతా బురద నీటితో, తీవ్ర దుర్వాసనతో దర్శనమిస్తున్నది. గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బయ్యనగూడెం గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న సచివాలయం, అంగన్వాడి కేంద్రం ఆవరణ బురద మాయంగా మారింది. ఈ రెండు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఉన్న చెట్లపై కొంగలు వాలడం వాలి చిరాకు చేయడంతో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. సచివాలయంలోకి ఎస్సీ కాలనీ ప్రజలు వివిధ పనులకు రావాలన్నా పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అంగన్వాడి కేంద్రానికి చిన్నారులను వారి తల్లిదండ్రులు పంపించాలంటే వెనకడుగు వేస్తున్నారు. తీవ్ర దుర్వాసనతో దర్శనమిస్తున్న అంగన్వాడి కేంద్రానికి చిన్నారులను పంపించాలంటే అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఎస్సీ కాలనీ ప్రాంత ప్రజలు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యలకు పరిష్కారం చూపాలని ఎస్సీ కాలనీ ప్రాంత ప్రజలు కోరుతున్నారు .

పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర - ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణ పురం ఆయకట్టులో నీట మునిగిన పంట పొలాలను మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఐదు రోజుల నుంచి నీటిలోనే పంట పొలాలు ఉన్నాయని రైతులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు. తల్లాపురం గ్రామంలో కూడా నీట మునిగిన పంట పొలాలను పరిశీలించామని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా పశువైద్య సేవలు

విశాలాంధ్ర-కుక్కునూరు/ వేలేరుపాడు: వరద ప్రభావిత ప్రాంతాల్లో కలె క్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి. నెహ్రూబాబు చెప్పారు. ఇందులో భాగంగా గత నాలుగు రోజుల్లో 121 ఆవులు, 51 గేదెలు,132 మేకలు,35 గొర్రెలు కలిసి 339 పశువులకు వైద్య సేవలు అందించినట్టు తెలిపారు. మినరల్ మిక్సర్ 339 కేజీలు పంపిణీ చేశామ న్నారు. వ్యాధి నిరోధక టీకాలు కింద హెచ్ ఎస్- 913 డోసులు, ఇటి-1046 డోసులు వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు వేలేరుపాడు మండలం మేడేపల్లి, కోయమాధారం, రామవరం,ఉదయనగర్, గుండ్లవై, కక్కునూరు మండలం ఇసుకపాడు, గొమ్ముగూడెం, ఉప్పరమద్దిగట్ల, లచ్చిగూడెం, కౌండిన్యముక్తి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించామన్నారు.

26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-ఏలూరు: ఏ.పి.ఇ.పి.డి.సి.ఎల్., ఆధ్వర్యంలో ఈనెల 26 వ తేదీ శుక్రవారం ఏలూరు డివిజన్ పరిధిలోని ఏలూరు రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో (బాలయోగి సైన్సు పార్కు, అశోక్ నగర్ సబ్ స్టేషన్ వద్ద) విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జెపిబి నటరాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశం వినియోగించు కుని సమస్యలకు పరిష్కారం పొందవలసినదిగా కోరారు.

వరదబాధితులకు లక్ష రూపాయల విరాళం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : వరదబాధితులకు అవసరమయ్యే సామాగ్రి కొనడానికి ఆత్మ బందువులం సేవా సంఘం సభ్యులు ఒక లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందజేశారు. వరద బాధితులకు వస్తు సేకరణ చేస్తున్న కేంద్రంను మంగళవారం స్థానిక మోహన్ స్టూడియో వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్. వి. ఆర్.సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కె. పెద్ద కృష్ణం రాజు వాసవి ఇంజనీరింగ్ కాలేజెస్ చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, ఏ. బి. ఎఫ్.గౌరవాధ్యక్షులు కడియాల పరశురామయ్య , అధ్యక్షులు వెజ్జు దుర్గా ప్రసాద్ , గీతా అంబికా, పరమాత్మ, ప్రసాద్ బాబు, కే .వి.చలం, కె.మురళీ కృష్ణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అధికారులకు యుటిఎఫ్ వినతి పత్రాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉంగుటూరు మండల యుటిఎఫ్ అధ్యక్షులు వునుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి దాకి జోగినాయుడు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం చేశారు. ఎంపీడీవో డి. ఎల్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఎంఈఓలు ఎన్.రవీంద్ర భారతి, కె.శ్రీనివాసరావులకు యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలని వినతి పత్రం ఇచ్చారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ మాట్లాడుతూ జీవో నెంబర్117 కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం రద్దు చేయాలని కోరారు. జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి, వునుముల రాంబాబు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ నుండి ఐదు వరకు ఒకే పాఠశాల లో నిర్వహించాలని కోరారు.జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లు శ్రీను మాట్లాడుతూ హైస్కూల్ లో సమాంతరంగా ఆంగ్ల, తెలుగు మీడియంలు, నిర్వహించాలని తెలిపారు. జోగినాయుడు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ లో బోధనేతర సిబ్బందిని నియమించాలని, ఉపాధ్యాయుల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, హరికృష్ణ, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరంపాలెంలో వరద ప్రాంతాలను పరిశీలించిన టీడీపీ మండలాధ్యక్షులు పోతుల మోహనరావు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు సింగరంపాలెం గ్రామంలో అధిక వర్షాల వలన అతాకుతులం అయిన ఎలిమెంటరీ స్కూల్ సచి వాలయానికి వెళ్లి హరిజన వాడను సందర్శించి, తుఫాన్ కారణంగా నష్టపోయిన వారిని కలిసి మనోధర్యాన్నిస్తూ ఇల్లు కూల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించి మేమున్నామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నీరు నిలిచిపోవడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరంపాలెం గ్రామ టిడిపి అధ్యక్షులు అక్కిన నాగేశ్వంరావు, అక్కిన సుదర్శన్ రావు, బోళ్ళ సతీష్, బుద్ధరాజు శివశంకర వర్మ, కుక్కల రమేష్, కుక్కల సురేష్, కుక్కల మహాలక్ష్మి, రాంది మన్నెష్, రాంది అప్పన్న, టెంకా నాగరాజు, మర్రి అబ్బులు,సచివాలయం సెక్రటరీ, సిబ్బంది, వీఆర్వో, ఎనర్జీఏస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం : కూటమి నేతలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మండలం లంకాఆఫ్ ఠానేలంక, గురజాపులంక, కునాలంక, వరద ముంపు ప్రాంతాల్ని ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల బుచ్చిబాబు సోదరులు పృథ్వీరాజు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు ముమ్మిడివరం ఎంపీడీవో, తహశీల్దార్ వరద ప్రాంతాల్ని పర్యటించి మొక్కజొన్న, మునగ, బెండ, బీర, మిరప, ఇతర పంటలు నష్టపోయిన పంటల్ని, నీట మునిగిన ఇళ్లకు నష్ట పరిహారం అందేలా చూస్తామని అన్నారు. రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా రైతుల్ని ఆదుకునే ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే బుచ్చిబాబు అసెంబ్లీ సమావేశంలో ఉండడంవల్ల రాలేకపోయారు అని నష్టపోయిన పంటలు వివరాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తారని ప్రభుత్వ సహాయం చేసే విధంగా చేస్తారని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గొల కోటి దొరబాబు, అర్థాన్ని శ్రీనివాసరావు, గుద్దటి జమ్మి, గోదాసి పుండరీష్, దూడల స్వామి నాయుడు, నడింపల్లి శ్రీనివాసరాజు, నిమ్మకాయల రాజా, బద్రి రమాదేవి, కొయ్యల దుర్గ, మొదలగువారు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కాకినాడ : డా బిఆర్ అంబేత్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పాత బస్టాండ్ వద్ద సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్, అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న, క్లబ్ అధ్యక్షులు అలై పెంకే గోవిందరాజు అధ్యక్షతన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి, పాయకరావుపేట నియోజకవర్గం పరిశీలకులు అలై డా చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అధిక వర్షాల కారణంగా ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే ఈ వరదలు వర్షాల కారణంగా డ్రైనేజీలు మన పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ ఉండడం వల్ల దోమలు కీటకాలు అధికంగా చేరి సీజనల్ వ్యాధులు వైరల్ ఫీవర్ ఎక్కువగా ప్రబలుతున్నాయని ప్రజలంతా ఈ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, అలాగే దగ్గు, ఆయాసం, జలుబు ఎటువంటి అనారోగ్యం కలిగిన వెంటనే దగ్గరలో ఉన్న వైద్యుని సంప్రదించి వైద్యుని సలహా మేరకు మందులను వాడాలని సూచించారు. అలాగే ప్రస్తుతం నిఫా వైరస్ వ్యాప్తి ఉందని దీని లక్షణాలు దగ్గు, జలుబు, ఆయాసం అని ఈ వ్యాధి గబ్బిలాల వలన ఎక్కువగా సోకే ప్రమాదం ఉందని ప్రజలంతా ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డా చప్పిడి, డా కెవివి సత్యనారా యణ, సుమారు 550 మంది రోగులకు షుగర్, బిపి పరీక్షలను నిర్వహించి వారికి నెలకు సరిపడా మందులను ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అలై వసుం ఉపేంద్రనాథ్, జెడ్‌సి ముద్దన వెంకటేష్, నాగమణి, నక్కా చంద్రరావు, ఈతా ప్రసాద్, యాగా రాంబాబు, నేదూరి శేషగిరి, కొయ్య బంగారుబాబు, బుల్లి అబ్బులు, మహి, యాగా దుర్గ, నేదునూరి శ్రీనివాస్, గుండుపల్లి కృష్ణ, వాసంశెట్టి రమణ పాల్గొన్నారు.

వరిపొలాలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మురారి గ్రామంలోని నీటి మునిగిన వరి పొలాలను మంగళవారం ఎఫ్‌టిసిడిడిఎ హరి, ఎఫ్‌టిసిఏఓ సంజీవ్, మండలం వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్‌తో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్, రైతులు లక్ష్మణ దొర, తాతారావు, పద్మనాభ చౌదరి విఏఏఎన్ నాగదుర్గాప్రసాద్ ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్న కారణంగా జిల్లాలో వివిధ దశల్లో ఉన్న వరి పంట పై నీటిముంపు ప్రభావం లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియచేశారు. సార్వా నారు మడి దశలో ఉన్న వరి పంట, విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు, మూడు రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయడం వల్ల విత్తనం కోర గాలిపోసుకొని ఎటువంటి నష్టం జరగదు. అలా కాక నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవలసిన అవసరం ఏర్పడుతుంది అని అన్నారు. విత్తిన 7 నుండి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది, కాబట్టి నారు నీట మునిగిన 5 రోజులలోపు, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలాచేయాలి. నష్ట నివారణకు నీటిని తీసివేసిన తరువాత, 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా మరియు ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వలన కొత్తఆకు వచ్చి ఊడ్పులకు అందుతుంది. ఈ కార్యక్రమంలో రైతులు లక్ష్మణ దొర, తాతారావు, పద్మనాభ చౌదరి, విఏ నాగ దుర్గాప్రసాద్ ఉన్నారు.

త్రిపుల్ ఐటీకి మిరియాల వెంకట్ ఎంపిక

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హై స్కూల్ 20 23-20 24 విద్యాసంవత్సరానికి 10వ తరగతి పరీక్షల్లో దేవరపల్లికి చెందిన మిరియాల బాలకృష్ణ కుమారుడు మిరియాల వెంకట్ 600 మార్కులు గాను 575 మార్కులు సాధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే ఇటీవల ప్రకటించిన ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యాడు . శ్రీకాకుళంలో ట్రిబుల్ ఐటీ సీటు పొందాడు మంగళవారం విద్యార్థి మిరియా వెంకట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి శ్రీలక్ష్మి మండల విద్యాశాఖ అధికారులు ఎం తిరుమల దాసు అప్పారావు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి మిర్యాల వెంకట్పదో తరగతి పరీక్షల్ల 575 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంగా నిలిచాడని అలాగే ట్రిబుల్ ఐటీ లో సీట్ సాధించడం ఎంతో అభినందనీయమని ఆమె అన్నారు. విద్యలో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉపాధ్యాయులు సూచించారు.

చట్టాల పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - సీతానగరం: మహిళా, బాలల చట్టాల పై అవగాహన సదస్సు జరిగింది. మండలంలో సీతానగరం గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక చట్టం అధికారులు మహిళలు, బాలల చట్టాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అభివృధి, శిశు సంక్షేమ శాఖ ఏ సి డి పి ఓ పి వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. దీనిలో ఎంపిడిఓ కృష్ణ ప్రసాద్, తహశీల్దార్ నెల్సన్ బాబు, మండల వైద్య అధికారి డాక్టర్ చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల జరిగే నష్టాలను వివరించారు. అలాగే మన రాజ్యాంగం మహిళలకు, బాలలకు కల్పించిన చట్టాలు పై అందరూ తెలుసుకోవాలని అన్నారు. తద్వారా సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టవచ్చు అని అన్నారు. అధికారులు తమ బాధ్యతగా సమాజంలో విస్తృత స్థాయిలో మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి సి పి ఓ రాజకుమార్, పి ఓ ఐ సీ ప్రదీప్, కానిస్టేబుల్ రాజన్న దొర, ఓ ఎస్ సౌజన్య, సూపర్వైజర్లు వరలక్ష్మి, పెదలక్ష్మి, ఇందిరా భారతి, అంగన్వాడీ కార్యకర్తలు, పురోహితులు, పాస్టర్లు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై హర్షం

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ మంగళవారం పార్ల మెంట్‌లో పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు కేటాయించిన నిధులు పట్ల జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ బడ్జెట్ 5 కోట్ల మంది ప్రజలు ఊపిరి పీల్చుకునేలా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజలకు విశ్వాసం పెరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి భారీగా నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఇది పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు ఉమ్మడి విజయంగా రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారన్నారు. రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించడం ఆనందదాయకమని, ఈ బడ్జెట్‌తో రాజధాని అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ముందు కూడా కూటమి ప్రభుత్వం కేంద్రం నుంచి భారీగా నిధులు రాబడుతుందని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. రాజధాని రైతులు అమరావతికి భూమిలిస్తే జగన్ స్మశానం చేశాడని ఆరోపించారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి తీసుకు రాకపోగా మూడు రాజధానులు అని కాలయాపన చేసిందని రమేష్ విమర్శించారు.

కేంద్రబడ్జెట్‌పై చీకురుమేల్లి హర్షం

విశాలాంధ్ర - పి గన్నవరం : కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ జనరంజికంగా ఉందని బిజెపి పి గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమేల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి అగ్రపీఠం వేసి అమరావతికి పునర్మాణానికి 15 వేల కోట్లు కేటాయించడం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

విశాలాంధ్ర - పెదపూడి : బిక్కవోలు మండలం ఊలపల్లిలో సర్పంచ్ బండారు రమ్య, తెలుగుదేశం నాయకులు తొండాపు సురేష్ రెడ్డి మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు, చేతి గ్లౌజులు, మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపిపి పెంకేమంగాయమ్మ గోవిందు, యంపిటిసి బండారు శివ, మాజీ సర్పంచ్ గేదెల సత్యన్నారాయణ, టీడీపీ నాయకులు గెద్దాడ పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వంతో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర - దేవరపల్లి : జనసేన పార్టీ సభ్యత్వం బహుళ ప్రయోజనంతో కూడి ఉన్నదని ప్రతి జనసైనికుడు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వ నమోదు చేయించాలని గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు పిలుపునిచ్చారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో మంగళవారం సాయంత్రం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కట్నం గణేష్ ఆధ్వర్యంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించి రాష్ట్రంలో పార్టీకి మంచి గుర్తింపు తెచ్చారన్నారు. పవన్ కళ్యాణ్ స్ఫూర్తిగా ప్రతి జన సైనికుడు జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. జనసేన పార్టీ సభ్యత్వం నాలుగో విడత జరుగుతోందని గతంలో నియోజకవర్గంలో 4,000 మందిని జనసేన సభ్యులుగా చేర్పించామన్నారు. నాలుగో విడతలో 20వేల మందిని చేర్పించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జనసేన పార్టీ సభ్యత్వం తీసుకొని ఇన్సూరెన్స్ చేయించుకోవడం వలన ఇటీవల దేవరపల్లిలో మృతి చెందిన కోట సురేష్ కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెక్కును అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కాట్నం గణేష్ వర్దినీడి నరేంద్ర పుట్ట సాయి బల్ల రాము నూకల కరుణాకర్ పోతుల భరత్ రామకోటి సత్యనారాయణ అయ్యప్ప స్వామి సూరి బాబు పోతుల భరత్ ప్రశాంత్జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర - మామిడికుదురు : మండల పరిధిలోని పాశర్లపూడి కైకాల పేటకి చెందిన 52 యేళ్ళ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడు గెద్దం సత్యనారాయణ మూర్తినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు నగరం ఎస్ఐ పి సురేష్ తెలిపారు. వరుసకి మరిది అయ్యే నిందితుడు బాధితురాలుపై కన్నేసి వంట గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో పరారీ అయినట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొంది. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దల సమక్షంలో పంచాయతి పెట్టినా ఫలితం లేకపోవడంతో బాధితురాలు నగరం పోలీసులను ఆశ్రయించింది.

ఇళ్ల మధ్య డంపింగ్ యార్డ్‌ను తొలగించిన అధికారులు

విశాలాంధ్ర - కరప : విశాలాంధ్ర పత్రికలో ఇళ్ళ మధ్యే డంపింగ్ యార్డ్ అనే వార్త కథనానికి వైద్య అధికారులు స్పందించి కరప నక్కవారి పేట ప్రాంతంలో పర్యటించారు. ఇళ్ళ మధ్యనే ఉన్న డంపింగ్ చేసిన చెత్తాచెదారాలను పరిశీలించారు. చుట్టూ కాళీ ప్రదేశం వర్షాలకు నీటితో నిండిపోయి దుర్గంధపు వాసనతో భరించలేని కంపు కొడుతోందని వాస్తవ పరిస్థితులను విశాలాంధ్రకు వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కాళీ సైట్ వ్యక్తులపై తగిన విధంగా చర్యలు తీసుకుని పశువుల పేడ వ్యర్థాలను వేస్తున్న వ్యక్తిని తొలగించే విధంగా చర్యలు తీసుకుందేందుకు పంచాయతీ అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఈ ఏరియాలో ఎటువంటి డయేరియా, డెంగు, వంటి రోగాలు లేవని డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ముగ్గు, బ్లీచింగ్, స్ప్రేయింగ్ వంటివి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సైట్‌లో బయట వ్యక్తులు, పశువులు కట్టి అపరశుభ్రం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గోపి, ఎన్ఎల్‌హెచ్ పి ప్రసాద్, రెహన, ఏఎన్ఎం విజయ్ కుమారి, ఆశ వర్కర్ గుబ్బల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాంల పంపిణీ

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరం పంచాయతీ పత్తిగొంది, పి మల్లవరం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం వారు అందజేసిన యూనిఫారంలు, బ్యాగ్‌లు అందజేశారు. సచివాలయం సిబ్బందితో నిర్వహించబడిన "స్వచ్ఛ భారత్" డ్రాయింగ్, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ధూళిపూడి వెంకట రమణ(బాబి) మాట్లాడుతూ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను అర్థం చేసుకుని ప్రతీ విద్యార్థి మంచి మార్కులతో పాస్ కావాలని, అటువంటి విద్యార్థులను ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు ఉచితంగా చదివిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పేర్రాజు, వుంగరాల వెంకటేశ్వరరావు, యంపిటిసి రాంబాబు, విళ్ళ సత్యనారాయణ, ధూళిపూడి సుభ, పంపన రామకృష్ణ, పలివెల సత్తిబాబు, తులసి, నాగరత్నం, ధూళిపూడి సుబ్బారావు, పితాని విష్ణు, యడ్ల కుటుంబరావు, చిట్టూరి నాగు, పోశంశెట్టి సూరిబాబు, వేగి ప్రసాద్, సత్తికొండ, ఉపాధ్యాయులు త్రినాథ్, అరుణ్ కుమార్, కుమార్, రాజ్యలక్ష్మి, పద్మజ, వరలక్ష్మి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వరద విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర - రాజోలు : వరదల వలన ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని అమలాపురం ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాజోలులో ఏటిగట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో నీటి ఊళలు, గండ్లు పూడ్చేందుకు ఇసుక మూటలు సిద్ధం చేశామని తెలిపారు. ఇసుక డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ఏటిగట్టి వెంబడి ఉన్న కుటుంబాలకు ట్యాంకర్ల మంచినీరు సరఫరా చేయించారు. ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డితో పాటు హెడ్ వర్క్స్ చీఫ్ ఇంజనీర్ ఎన్ పుల్లారావు, ఎస్ఈ డి శ్రీనివాస్, డీఈఈ జి శ్రీనివాస్, ఏఈఈ టివిఎస్ఎన్ మూర్తి, రాజోలు తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

నన్నయ ఇన్చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రాజానగరం : భారత దేశ స్వతంత్ర కోసం తమ ప్రాణాలు సైతం తృణప్రాయంగా వదిలేసిన ఉద్యమకారులైన చంద్రశేఖర్ ఆజాద్ సీతారాం తివారీ, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వంటి మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలనీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతినీ పురస్కరించుకొని మండలంలోని ఆదికవి నన్నయ వర్సిటీ నందు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.దీనిలో భాగంగా బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటాలకు ఇన్చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 'స్వాతంత్ర్యం నా జన్మ హక్కు' అంటూ గర్జించిన మహనీయుడు తిలక్ అని గుర్తుచేశారు. విద్య గొప్పతనాన్ని ఎరిగిన తిలక్ పాఠశాలలు, పత్రికలు నడిపారని, గీతా రహస్యం లాంటి మహోన్నత గ్రంథాలు రాశారని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం భగత్ సింగ్ రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైల్లు పరిగెత్తించి, సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ అజాద్ అని గుర్తు చేశారు. భారతదేశం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని మనమంతా జీవించాలన్నారు. అటువంటి మహనీయుల త్యాగాల ఫలితమే నేటి భారతదేశమని, అందరూ బాధ్యతగా తమ విధులు నిర్వహిస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరదల సమయాల్లో పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలి : వెటర్నరీ డిడి రాధాకృష్ణ

విశాలాంధ్ర - పెరవలి : వరదలు సమయాల్లో వరద నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చే పాములు ఇతర కిటకాలతో పశువులకు హాని కలిగే ప్రమాదం ఉందని రైతులు తమ పశువులను వాటి బారిన పడకుండా ఏటిగట్టు పైకి ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వసు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాధాకృష్ణ పాడి రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో గోదావరి ఏటి గట్టు వద్ద పాడి రైతులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వలన గోదావరి వరద ముంపునకు గురైన లంకలలోను, ఏటి గట్టు, పల్లపు ప్రాంతాలలో వున్న పశువులన్నిటినీ ఒడ్డుకు తీసుకురావాలని, పశువులకు వ్యాక్సిన్ వేయించని వారు గొంతు వాపు జబ్బ వాపు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని, పశువులకు ఏమైనా అత్యవసర పరిస్థితి వస్తే రైతులందరూ తమ పశువులకు వెంటనే చికిత్స నిమిత్తం సిబ్బంది ఎల్ల వేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాక్సిన్ వేయించని పశువులకు మంగళవారం వ్యాక్సిన్లు వేశారు. ఈకార్యక్ర మంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రిషి ప్రసాద్ పెరవలి పశువైద్యాధికారి డాక్టర్ చరణ్ ఫణీంద్ర,ఖండవల్లి పశువైద్యాధికారి డాక్టర్ సల్మా పాడి రైతులు పాల్గొన్నారు.

అల్కాట్ గార్డెన్ పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఎదుర్లమ్మలంక, కేతవారిలంకకు చెందిన 248 మందికి మున్సిపల్ కళ్యాణ మండపంలో పునరావాసం కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు మంగళవారం మధ్యాహ్నం అల్కాట్ గార్డెన్ - మున్సిపల్ కళ్యాణ మండపం పునరావాస శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పునరావాసం కల్పించిన లంక గ్రామాల ప్రజలతో మాట్లాడడం జరిగింది. గోదావరీ నదికి పై నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఇక్కడికి తరలించనున్నారు. వరద ఉధృతి తగ్గే వరకు ఈ శిబిరంలో ఉండాలని, అధికారులు సూచనలు అనుసరించి సహకరించాలన్నారు. పునరావాస కేంద్రంలో అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకున్నారు. శానిటరీ నిర్వహణా విషయంలో అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పునరావాస కేంద్రంలో ఉన్న వారికీ వేడి నీళ్లు అందించడం, మహిళలకు, పురుషులకు ప్రత్యేక వసతీ సదుపాయాలు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరంలో అందుబాటులో ఉంచిన మందుల వివరాలు, చికిత్స తదితర వివరాలు తెలుసుకున్నారు. దోమల నివారణ కు సంబంధించి పిచికారి చేపట్టాలని, వేడిగా ఉన్న ఆహారం అందచేయాలని ఆదేశించారు.

ముంపు పంటలకు శాస్త్రవేత్తల సూచనలు

విశాలాంధ్ర - నిడదవోలు : అల్పపీడనం వలన కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ దశలలో ఉన్న వరి పంట ముంపునకు గురైందని, మెరకలలో సాముహిక నారుమల్లు వేసుకోవడం ద్వారా లోతట్టు ప్రాంత రైతులకు ఉపయోగ యుక్తంగా ఉంటుందని వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పివి సత్యనారాయణ సూచించారు. తూర్పుగోదావరి జిల్లాపర్యటన భాగంగా మంగళవారం రావి మెట్ల,తిమ్మరాజుపాలెం, కంసాలి పాలెం గ్రామాల్లోని వరి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం మాట్లాడుతూ ఈ నెలలో 297.9 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది అన్నారు . 18న ఒక్కరోజే జిల్లాలో 97.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది అన్నారు. ఇంతవరకు జిల్లాలో 51,831 హెక్టార్లలో వరి నాట్లు పూర్తికాగా 16728 హెక్టార్లలో పంట పాక్షికంగాను, మరి కొన్నిచోట్ల పూర్తిగా పంట నీట మునిగినట్లు తెలిపారు. నీట మునిగిన చేలలో ముందుగా నీరు బయటికి తీసి నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. జూన్ లో పంట మొలకల దశలో,జూలైలో విత్తిన పంట నారుమడి దశలో నేరుగా విచ్చిన పంట మొలక దశలో నుండి మొక్క దశలో ఉన్నాయి జిల్లాలో 65.78 శాతం మేర వరి నాట్లు పూర్తయ్యాయి. నారుమడి దశలో 60 హెక్టార్లలో వరి పంట ఉందన్నారు. మునిగిన నారు మడిలో నుండి ఐదు రోజుల లోపు నీరు పూర్తిగా తీసివేసిన తర్వాత ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పోటాష్ వేసుకోవాలి అన్నారు. ఒక గ్రాము కార్బన్డిజిమ్ లేదా రెండు గ్రాముల కార్బన్డిజిమ్,మాంకోజెబ్ ను పిచికారి చేయాలన్నారు. పిలకల దశలో ఉన్న వరి పంట మునిగితే నీరు బయటకు తీసిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా 20 కిలోల పోటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఒక గ్రాము కార్బన్డిజిమ్ లేదా రెండు గ్రాముల కార్బన్డిజిమ్,మాంకోజెబ్ ను పిచికారి చేయాలన్నారు. నారుమడి ప్రధాన పొలంలో వరి పంట పూర్తిగా దెబ్బతిని పైన తెలిపిన యాజమాన్య పద్ధతులు వీలుకానిపక్షంలో రకాలు ఎం టి యు 1153,1156, వంటి స్వల్ప కాలిక వరి వంగడాలను వేసుకోవాలన్నారు. వీటి కాలపరిమితి 125 రోజులు అని ఆయన తెలిపారు. ఆలస్యంగా ఆగస్టు మొదటి పక్షంలో వేసుకోవడానికి అనువైన రకాలు. నాట్లు వేసి వారం రోజులు మాత్రమే పూర్తయి. పంట వర్షానికి పూర్తిగా దెబ్బతిన్న రైతులు యమ్ టి యు 1239 వంటి మధ్య కాలిక, పడిపోనీ రకము వేసుకోవాలన్నారు. వీటి కాలపరిమితి 145 రోజులు.ఆలస్యంగా ఆగస్టు మొదటి పక్షంలో వేసుకోవడానికి అనువైన రకము. ఏడి ఆర్ టి శ్రీనివాస్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట నరసింహారావు డి ఏ ఓ ఎస్ మాధవరావు ఏడిఏ పి చంద్రశేఖర్ గుర్తులు సత్యనారాయణ మార్టేరు శాస్త్రవేత్తలు స్థానిక రైతులు పాల్గొన్నారు.

గోదావరికి పెరుగుతున్న వరద ఉధృతి

- నీట మునిగిన అప్పనపల్లి కాజ్వే
- బాల బాలాజీ దర్శనం నిలిపివేత

విశాలాంధ్ర - మామిడికుదురు : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతుంది. మండల పరిధిలోని అప్పనపల్లి కాజ్‌వే పై వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ కాజ్‌వే నీట మునగడంతో మూడు లంక గ్రామాల ప్రజలకి బాహ్య ప్రపంచంతో సంభందాలు తెగిపోతాయి. వరద ఉధృతి దృష్టిలో పెట్టుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో మంగళవారం ఆర్డీవో కేశ వర్ధన్ రెడ్డి, తహసీల్దార్ మెరి కమ్మ,ఎస్ ఐ సురేష్ పరిశీలించారు. వరద ఉధృతి క్రమేపీ పెరగనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. గోదావరి మధ్య లంకల్లో ఉన్న పశుగ్రాసం సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రైతులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

- పెదపట్నం గోదావరి మధ్యలంకలో చిక్కుకున్న మూగజీవాలు : వైనతేయ గోదావరికి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతూ ఉండటంతో లంక గ్రామాల ప్రజలు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.పెదపట్నం గ్రామంలోని మధ్య లంకలో పది నుండి పదిహేను మూగ జీవాలు చిక్కుకున్నట్లు సమాచారం. వీటిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఇంజిన్ పడవలు అవసరం అవుతాయి. అయితే స్థానికంగా ఉన్న ఇంజిన్ పడవలు మరమ్మతులకి గురి కావడంతో వాటిని రిపేర్ చేస్తేనే మూగ జీవాలను సురక్షితంగా బయటకి తీసుకువచ్చే అవకాశం ఉంటుంది. మూగ జీవాలను రక్షించుకునేందుకు వాటి యజమానులు, స్థానికులు ఇంజిన్ పడవలు మరమ్మతులు పనులు ప్రారంభించారు.

కంద్ర బడ్జెట్ రాష్ట్ర రాజధాని అమరావతినే కాదు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని గాడిలో పెట్టవచ్చు



విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర రాజధాని అమరావతినే కాదు చతికిలపడ్డ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని తిరిగి గాడిలో పెట్టే అద్భుత కేంద్ర బడ్జెట్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందించారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ కొని యాడారు. అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు ఈ ఏడాది ఆ తర్వాత వచ్చే సంవత్సరంలో మరిన్ని నిధు లు ఇస్తామన్న హామీతో ఇక రాజధాని నిర్మాణం పరుగులు పెట్టడం ఖాయమని రవికిరణ్ అన్నారు. రాష్ట్ర మౌలిక వసతుల కల్పనకి అధిక నిధులు, వెనుకబడిన జిల్లాలకి మరిన్ని నిధులు, పోలవరం పూర్తికి శరవేగంగా అడుగులు, వివిధ పారిశ్రామిక నోడ్ల అభివృద్ధి, పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి చోటు తదితర పథకాల ద్వారా ఇక రాష్ట్ర అభివృద్ధి వచ్చే ఐదేళ్లలో అద్భుతంగా ఉండనున్నదిని రవికిరణ్ హర్షం వ్యక్తం చేశారు. మధ్యతరగతి వేతన జీవులు ఎంతగానో ఎదురు చూస్తున్న ఆదాయ పన్ను తగ్గింపు స్లాబ్లా పెంపు ద్వారా వారి జీవితాలలో ఆనందం నింపారని, ఉద్యోగ కల్పనకి యువత నైపుణ్య శిక్షణకి రెండు లక్షల కోట్లతో బృహత్ప్రణాళిక రూపకల్పన వారి 15 వేలు ఆర్థికసాయం, పరిశ్రమలతో అనుసంధానం చేస్తూ కోటి మందికి ఇంటెన్షిప్ అందించటం శిక్షణ కలంలో నెలకి 5000 ఆర్థిక సహాయం వంటివి యువతకు ఎంతో ఊతమిస్తాయని అన్నారు. పేదలు రైతులు మహిళలు యువత సూక్ష్మ చిన్న పరిశ్రమలు వంటి అన్ని రంగాల వారికి మంచి చేకూర్చే బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మల సీతారామన్‌కి ధన్యవాదాలు తెలియజేశారు.

వర్షాలతో నానా అవస్థలు

విశాలాంధ్ర - పెదపూడి : ఎడతెరిపి లేని వర్షాలతో వారం రోజులుగా రైతులు, వ్యాపారస్తులు, విద్యార్థులు నానాఅవస్థలు పడ్డారు. మంగళవారం వాతావరణం మబ్బు మబ్బుగా ఉన్నప్పటికీ వర్షం లేకపోవడంతో అన్ని వర్గాలు వారు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పలు చోట్ల పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళనకు గురి కావడం జరిగింది. ఒక్కసారిగా వర్షం తగ్గడంతో రైతులు ఆందోళన నుండి ఉపశమనం పొందారు.